# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

| సంపుటి : 01 | సంచిక : 172 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 22 మే 2026 | పేజీలు : 4 |
|---|---|---|---|---|





స్పిరిట్‌లో అదిపోయే

ట్విస్ట్..

4


# అర్హులైన జర్నలిస్టులను గుర్తిస్తాం..

- సమాజానికి ఉపయోగపడే వార్తలు అందించాలి
- జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి
- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో 2026-2028 సంవత్సరానికి సంబంధించిన మీడియా అక్రిడిటియేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటియేషన్ కమిటీ చైర్మన్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా మీడియా అక్రిడిటియేషన్ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ దరఖాస్తుల సంఖ్య, పరిశీలన విధానం గురించి డీపీఆర్ఓని అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన నిజమైన జర్నలిస్టులకే అక్రిడిటియేషన్ కార్డులు జారీ చేయాలని సూచించారు. వృత్తి ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రామాణికంగా పరిగణించాలన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, బాధ్యతాయుతంగా నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. అక్రిడిటియేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని తెలిపారు. సమావేశంలో డీపీఆర్ఓ బండి పల్లవి, డీఎం ఆర్టీసీ స్వాతి, అక్రిడిటియేషన్ కమిటీ సభ్యులు ఇర్రి మల్లా రెడ్డి, ఎస్.భిక్షపతి, ఉప్పలంచి నరేందర్, కొత్తపల్లి కిరణ్ కుమార్, వి.మధు, జాల రమేష్, యూ.మహేష్, నీల నరేష్ బాబు, అబిద్ ఫైసల్ ఖురేషి పాల్గొన్నారు.



వానకొండయ్య గుట్టపై మైనింగ్ 3 లో

## పర్మిషన్ రద్దు చేయాలి

- కలెక్టర్‌కు మాజీ మంత్రి ఎర్రబెల్లి వినతి




# కొనుగోళ్లను సాఫీగా నిర్వహించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 20,953 రైతుల వద్ద నుంచి 1,21,063 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, అందులో ఇప్పటికే 1,14,484 మెట్రిక్ టన్నులను మిల్లులకు తరలించడం జరిగిందని, అలాగే 17,180 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 211 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా 95,970 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్ లో నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో కొనసాగుతున్న మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి మిల్లు, కేంద్రం వారీగా కొనుగోలు వివరాలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు, అలాగే మిల్లుల వద్ద ఎంత అన్లోడింగ్ పెండింగ్ ఉంది అని క్షుణ్ణంగా సమీక్షించారు. మిల్లర్లు అదనపు గోదాములను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువస్తున్న మొక్కజొన్న, వరి ధాన్యాన్ని ఎటువంటి జాప్యం లేకుండా తూకం వేసి, త్వరగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగుల కొరత తలెత్తకుండా తగిన నిల్వలు ఉంచాలని స్పష్టం చేశారు. కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన ఓపీఎంఎస్ (OPMS) నమోదును ఎప్పటికప్పుడు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రవాణా, గోదాముల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరు పట్ల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో భాస్కర్, మార్క్ ఫెడ్ డీఎం చంద్రశేఖర్, డీసీఓ కోదండరాములు, డీఎంఓ రామకృష్ణ, అదనపు డీఆర్డీవో నూరుద్దీన్, పౌరసరఫరాల సంస్థ డీఎం హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోనీ పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని మండలాల వారీగా సమీక్షిస్తూ, స్లాబ్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను తుది దశకు తీసుకురావాలన్నారు. ప్రతి మండలంలో 20 ఇళ్లను పూర్తిచేయాలన్నారు. అలాగే జూన్ 2 కల్లా వెయ్యి ఇళ్లను గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలన్నారు. ప్రతి పూర్తైన ఇందిరమ్మ ఇంటికి ఐహెచ్హెచ్ఎల్ ఖచ్చితంగా ఉండాలన్నారు. ఆ విధంగా ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయ సమావేశాలు నిర్వహించి, పరిశీలించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల కోసం రుణాలను ఇప్పించాలన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, జెడ్పీ సీఈవో రంగా రావు, డీఈలు, అన్ని మండలాల ఎంపిడిఓలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల సాధనకు తరలిరావాలి



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** రఘునాథపల్లి మండల కేంద్రంలో లంబాడి హక్కుల పోరాట సమితి మండల ఇన్చార్జి ఇస్లావత్ భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్చార్జి కొర్ర రాజేందర్ నాయక్ "చలో హైదరాబాద్ మహాధర్నా" కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 26వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు బానోత్ బిక్షపతి నాయక్ మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ గిరిజన బంజారా సమాజానికి "చేవెళ్ల ట్రైబల్ డిక్లరేషన్" పేరుతో 12 హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. గిరిజనుల అభివృద్ధి, తండాల సమస్యలు, భూముల పరిరక్షణ, విద్య, ఉపాధి అవకాశాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, "మా తండాలో మా రాజ్యం" సాధించిన గిరిజన సమాజం పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఇన్చార్జి కొర్ర రాజేందర్ నాయక్ మాట్లాడుతూ, లంబాడి హక్కుల పోరాట సమితి ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తిచేసుకుని అనేక గిరిజన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిందని తెలిపారు. కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ మండల సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రఘునాథపల్లిలో పండ్లు, మజ్జిగ పంపిణీ

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** మాజీ భారత ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రఘునాథపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథపల్లి మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అలాగే ఎండ తీవ్రత దృష్ట్యా రఘునాథపల్లి బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు, ప్రజలకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రఘునాథపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కడారి రవి, మార్కెట్ డైరెక్టర్ సిద్దేశ్, జిల్లా నాయకులు గాద మహేందర్ రెడ్డి, మేకల నరేందర్, ఎండి ఇబ్రహీం, నీలం యువరాజ్, సర్పంచులు గొంగల అబ్రహం, లోనే రవి, కడారి చిన్న నాగేష్, ఈశ్వరయ్య, రఘునాథపల్లి వార్డు సభ్యుడు రాములు, యూత్ నాయకుడు వడ్లకొండ శివప్రసాద్‌తో పాటు పలువురు మండల, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**జాఫర్‌గఢ్, మన చౌరాస్తా :** జాఫర్‌గఢ్ మండల కేంద్రంలోని వడ్డెగూడెం గ్రామానికి చెందిన కుక్కల రాజేందర్ ఇటీవల మరణించగా, వారి కుటుంబ సభ్యులను బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు కోరుకొప్పుల నగేష్ గౌడ్, మన్ కీ బాత్ మండల కన్వీనర్ గిరగొని యాదగిరి గౌడ్, మండల కార్యదర్శి బొడ్డు అశ్విని, మహిళా మోర్చా మండల నాయకురాలు మారేపల్లి విజయ, బూత్ అధ్యక్షులు సంగ గోపాల్, కుక్కల ఎల్లయ్య పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి



**వరంగల్, మన చౌరాస్తా :** భారతదేశ సాంకేతిక విప్లవ పితామహుడు, మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని వరంగల్ లోని ఎంజమ్ సెంటర్ చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ అడప మహేష్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడుప మహేష్ మాట్లాడుతూ భారతదేశాన్ని 21వ శతాబ్దపు ఆధునిక దేశంగా తీర్చిదిద్దేందుకు రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. నేడు దేశం ఐటీ టెలికాం రంగాలలో సాధించిన ప్రగతికి ఆనాడే ఆయన వేసిన పునాదులే కారణమని గుర్తుచేశారు. దేశంలో 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. దేశ ఐక్యత సమగ్రత కోసం తన ప్రాణాలనే త్యాగం చేసిన అమరజీవి రాజీవ్ గాంధీ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, దస్రునాయక్ వడ్లకొండ తిరుపతి పాల్గొన్నారు.



# మైనింగ్ పర్మిషన్ రద్దు చేయాలి

- **మాజీ మంత్రి ఎర్రబెల్లి**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా దేవరుప్పుల మండలం లకావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీవానకొండయ్య లక్ష్మీనరసింహ స్వామి స్వయానా కొలువైన క్షేత్రం మైనింగ్ మాఫియా చేతిలో పడి ఉనికి కోల్పోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను దేవరుప్పుల మండల బిఆర్ఎస్ బృందంతో కలిసి మెమోరాండం అందజేసి గుట్ట మీద జరుగుతున్న మైనింగ్ పర్మిషన్ ను రద్దు చేయాలని కోరారు. గుట్ట వద్ద మైనింగ్ పనులు జరుగుతే ఆ దేవాలయం ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పనులను ఆనాటి సీఎస్ సోమేశ్ కుమార్‌కు చెప్పి పర్మిషన్ రద్దు చేయించి దేవస్థానం మనుగడను కాపాడి 2 కోట్ల రూపాయలతో దేవాలయ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మళ్లీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల అ యొక్క పనులను తిరిగి మొదలుపెట్టారని మండిపడ్డారు. గుట్ట వద్దకు బీఆర్ఎస్ నాయకులు పనులను అడ్డుకావడానికి వెళ్తే మా నాయకుల మీద కేసులు పెట్టి, నోటీసులు పంపించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఏది ఏమైనా వానకొండయ్య గుట్ట మైనింగ్ పనులు ఆపకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. వీటితో పాటు పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వం తొందరగా కొనుగోలు చేయాలని కోరారు. అలాగే మాదాపురం గ్రామంలో ఎస్సీ కాలనీలో 30 డబుల్ బెడ్ రూం ఇండ్ల మూడవ విడత బిల్లులు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కవి సంగిశెట్టి శ్రీనివాస్‌కు సన్మానం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ కవులు కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో కవులు, సాహిత్య ప్రముఖులను ఘనంగా సత్కారించారు. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో జనగామ కవులు ప్రత్యేకంగా సన్మానాలు అందుకున్నారు. గురువారం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి చేతుల మీదుగా కవి, తెలంగాణ చరిత్ర పరిశోధకుడు సంగిశెట్టి శ్రీనివాస్‌ను సన్మానించి ఆయన సాహిత్య సేవలను కొనియాడారు. ఐక్యవేదిక 7వ వార్షికోత్సవం సందర్భంగా అభినందన కల్చరల్ సొసైటీ ప్రొఫెసర్ తాటికొండ వెంకట రాజయ్య స్మారక అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, అయిలా సోమనర్సింహాచారి, కవులు గుడిపల్లి నిరంజన్, పెబ్బేటి మల్లికార్జున్, బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో జనగామలో విస్తృత స్థాయిలో సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న కవులు కళాకారుల ఐక్యవేదికకు నెల్లుట్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు నెల్లుట్ల రవీందర్ రావు చొరవతో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సహాయ కార్యదర్శి బేతి వీరారెడ్డి 10వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షుడు జి. కృష్ణ, ప్రధాన కార్యదర్శి పెట్లోజు సోమేశ్వరాచారి, కోశాధికారి అయిలా సోమనర్సింహాచారిని ఘనంగా సత్కారించారు. సత్కార గ్రహీతలు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కళాకారుడు ఓంకార్ రాజు కూడా పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు సిద్ధం కావాలి

- **ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**
- **హన్మకొండలో బీఆర్ఎస్ సమావేశం**



హన్మకొండ, మన చౌరాస్తా : హన్మకొండ జిల్లాలో గురువారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకుల వ్యూహాత్మక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హన్మకొండ, వరంగల్, జనగామ జిల్లాలకు చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే లు దాస్యం వినయ్ భాస్కర్, నన్నెపునేని నరేందర్, ఆరూరి రమేష్, పెద్ది సుదర్శన్ రెడ్డి, తాటికొండ రాజయ్య, నియోజక వర్గ ఇన్‌చార్జీలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరై వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల దుస్థితి, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, జిల్లా పార్టీ కార్యాచరణపై విస్తృతంగా చర్చిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారింద న్నారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్లు, మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయాయని తెలిపారు. ఎక్కడ చూసినా బస్తాల కొరత ఉందని, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని విమర్శించారు. ఇప్పటికే లిఫ్ట్ చేసిన ధాన్యాన్ని కూడా అన్‌లోడ్ చేయకుండా నిల్వ ఉంచుతున్నా రని అన్నారు. ధాన్యం దించేందుకు కూలీల సమస్య తీవ్రంగా ఉందని, రాష్ట్రంలోని అన్ని ఐకేపీ కేంద్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని పేర్కొన్నారు. కోటి మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు 25 శాతం కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. రైతులు పండించిన పంట కొనుగోలు కాక తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. ఒకవైపు వడదెబ్బలు, మరోవైపు గుండెపోటులతో రైతులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అత్యవసర చర్యలు తీసుకుని ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన రైతు సభతో ప్రభుత్వంలో కొంత కదలిక వచ్చిందని పల్లా గుర్తు చేశారు. ఆ సభ తర్వాత అధికారులు, పాలకుల్లో కొంత హడావుడి కనిపిం చిందన్నారు. కానీ అనంతరం పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చిందని విమర్శించారు. ప్రస్తుతం ఎక్కడ గొంగళి అక్కడే అన్నట్టుగా ఐకేపీ కేంద్రాల్లో సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని అన్నారు. రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. రైతుల ధాన్యం చివరి గింజ కొనుగోలు చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం ఆగదని పల్లా గారు స్పష్టం చేశారు. రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలని పల్లా పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో ఇద్దరిని గుర్తించి వారికి సభ్యత్వ నమోదు ప్రక్రియపై శిక్షణ ఇస్తామని తెలిపారు. కేంద్రం జూన్ 25 నుంచి చేపట్టనున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై బిఆర్ఎస్ నేతలు, కార్యక ర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లో అర్హుల ఓట్లు తొలగిపోకూడదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియ డిజిటల్ విధానంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం ప్రతి బూత్‌లో ఇద్దరిని గుర్తించడం జరుగుతుందని, వారికి జూన్ మొద టి వారంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. బిఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు అనేక మంది ఉత్సాహం చూపుతున్నారని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



# స్పిరిట్‌లో ట్విస్ట్..

సందీప్ రెడ్డి వంగా మోస్ట్ వైలెంట్ మేకర్.. ప్రభాస్ సూపర్ యాక్షన్ హీరో.. ఇలాంటి ఇద్దరూ కలిసినపుడు వచ్చే ఔట్ పుట్ కూడా మోస్ట్ వైలెంట్‌గానే ఉంటుందని ఊహిస్తారంతా. కానీ ఇక్కడే సందీప్ రూట్ మార్చేస్తున్నారు.. ఓ కొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నారు. స్పిరిట్ కోసం ఈ దర్శకుడు ఫాలో అవుతున్న రూటే సపరేటు. మరి ప్రభాస్ కోసం వంగా ఏం చేస్తున్నారు..? రెబల్ మోడ్ ఎలా ఉండబోతుంది..? ఏం చేసినా కొత్తగా ఉండాలి.. ఇండియన్ సినిమాకి తన మేకింగ్ స్టైల్ ఏంటో చూపించాలని గట్టిగానే ఫిక్సయ్యారు సందీప్ రెడ్డి వంగా. కథలు రొటీన్‌గానే అనిపించినా.. ఈయన తీసే విధానం అలాగే ఉంటుంది. అర్జున్ రెడ్డిలో ప్రేమలోని కొత్త కోణం చూపించారు వంగా. ఎన్నో లవ్ స్టోరీస్ వచ్చినా.. అర్జున్ రెడ్డి పాత్ బ్రేకింగ్ మూవీ అవ్వడానికి సందీప్ రైటింగ్, వే ఆఫ్ మేకింగే ప్రధాన కారణం. యానిమల్ కూడా అంతే..! కథా పరంగా సింపుల్ తండ్రీ కొడుకుల మధ్య సాగే ఎమోషనల్ డ్రామా. కానీ దాన్ని సందీప్ హ్యాండిల్ చేసిన విధానం.. మేకింగ్ స్టైల్ అన్నీ దీన్ని కొత్తగా మార్చేసాయి. రొటీన్ కథ చూస్తున్నామనే ఫీల్ కూడా రాకుండా.. స్క్రీన్ ప్లేతో పాటు మేకింగ్‌తో మాయ చేయడమే సందీప్ రెడ్డి వంగా స్టైల్. స్పిరిట్ విషయంలోనూ ఇదే చేస్తున్నారీయన. యానిమల్‌తో వైలెంట్ సినిమాకి అర్థం చూపించారు వంగా. స్పిరిట్ కూడా యాక్షన్ సినిమానే ముందు నుంచి ప్రచారం జరుగుతుంది. అందులో నిజం లేకపోలేదు.. కానీ యానిమల్ తరహా వైలెన్స్ స్పిరిట్‌లో ఉండదని.. ఇది చాలా సెటిల్డ్‌గా సాగే సైలెంట్ యాక్షన్ డ్రామా అని.. ముఖ్యంగా ఇగో క్లాషెస్ చుట్టూనే కథ సాగుతుందని తెలుస్తుంది. ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తుంటే.. వివేక్ ఒబేరాయ్ విలన్‌గా కనిపిస్తున్నారు. ఈ ఇద్దరి మధ్య సాగే ఇగో క్లాషే మెయిన్ స్టోరీ అంటున్నారు. ప్రస్తుతం ఈ సన్నివేశాలే చిత్రీకరిస్తున్నారు వంగా. యాక్షన్ డోస్‌కు ఢోకా లేకుండా.. ఇండియన్ సినిమాకు కొత్త రకమైన సైలెంట్‌గా సాగే వైలెంట్ డ్రామాను పరిచయం చేయబోతున్నారు వంగా. ఇది చేస్తూనే కల్కి 2లోనూ నటిస్తున్నారు ప్రభాస్.




Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**